

కళ్యాణదుర్గంలో జరిగిన కనకదాస విగ్రహావిష్కరణలో మంత్రులు నారా లోకేశ్, సవిత





గొర్రెపిల్లతో మంత్రి లోకేశ్

కురుబలను గుండెల్లో పెట్టుకుంటాం

బీసీల బలోపేతానికి అన్ని విధాలా కృషి

- టీడీపీతోనే బీసీలకు రాజకీయ స్వాతంత్ర్యం
- ఉమ్మడి జిల్లాకు ఎంత చేసినా తక్కువే
- భక్త కనకదాస జయంతి సభలో మంత్రి నారా లోకేశ్

కళ్యాణదుర్గంలో వేలాది మంది నడుమ విగ్రహావిష్కరణ





భారీ ర్యాలీగా వస్తున్న మంత్రి లోకేశ్, జనంతో కరచాలనం చేస్తూ..

కళ్యాణదుర్గం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచిన కురుబలను మరువబోమని, వారిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఏర్పాటు చేసిన తొమ్మిది అడుగుల భక్త కనకదాస కాంస్య విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. పట్టణంలోని హిందూపురం రింగ్ రోడ్డు వద్ద అశేష జనవాహిని మధ్య ఈ కార్యక్రమం జరిగింది. విగ్రహావిష్కరణ అనంతరం ఆ ప్రాంతానికి కనకదాస సర్కిల్‌గా మంత్రి నారా లోకేశ్ నామకరణం చేశారు. అంతకుముందు పట్టణంలోని ప్రజావేదిక నుంచి కనకదాస సర్కిల్ వరకు వందలాది మంది కురుబ కులస్థులు, అభిమానులు, ప్రజలతో కలిసి

(మిగతా 6వ పేజీలో)

రెవెన్యూ క్రీడాపోటీలు అభినందనీయం

- ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్
- రెండోరోజు కొనసాగిన రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు



టగ్ ఆఫ్ వార్‌లో తలపడుతున్న ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిత్యం ఒత్తిడితో కూడిన విధులు నిర్వర్తించే రెవెన్యూ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్ పేర్కొన్నారు. ఏడో రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతిక పోటీలు శనివారం అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో రెండోరోజు కొనసాగాయి. ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లుతో కలిసి మాంచోఫెర్రర్‌లు పోటీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాంచోఫెర్రర్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రాయలసీమ ప్రాంతంలో అనంతపురం వేదికగా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు జరపడం శుభపరిణామమన్నారు. ప్రతి క్రీడాకారుడు జాతీయ స్థాయి పోటీలే లక్ష్యంగా ఆటల్లో గెలవాలని రెవెన్యూ ఉద్యోగులకు సూచించారు. క్రీడా స్ఫూర్తి ఉన్నప్పుడే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలుగుతారన్నారు. క్రీడాపోటీలతో శారీరక దృఢత్వంతో (మిగతా 7లో...)

ఆదర్శప్రాయుడు కనకదాస

- కలెక్టరేట్‌లో ఘనంగా జయంతి వేడుకలు



కనకదాస జయంతిలో పాల్గొన్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సమాజంలో సమానత్వం, సత్సంగత, సేవ అనే విలువలను ఆచరణలో చూపిన భక్త కనకదాస సమాజానికి ఆదర్శనీయుడని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ కొనియాడారు. జిల్లా వెనుకబడిన సంక్షేమ తరగతుల శాఖ ఆధ్వర్యంలో భక్త కనకదాస జయంతిని శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తన కీర్తనలతో సమాజాన్ని జాగృతం చేసి, ఉత్తమ సమాజ నిర్మాణం కోసం పాటుపడ్డ దాస శ్రేష్ఠ ఆరాధ్యదైవం కనకదాసను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలన్నారు. కనకదాస జీవితం మన అందరికీ మార్గదర్శకం కావాలని తెలిపారు. వర్ణభేదాలు లేని సమాజం, పరస్పర గౌరవం, భక్తి మార్గం అనే సూత్రాలను ఆయన పాటించారని కొనియాడారు. జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ మాట్లాడుతూ.. కనకదాస సంగీతం, సాహిత్యంలోని ఆధ్యాత్మికత మనసును మేల్కొలుపుతుందని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓలు సువర్ణ, వీవీఎస్ శర్మ, ఆనందకుమార్, మహేష్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి రాజేంద్ర, ఆర్డీఓ కరుణసాగర్ రెడ్డి, జిల్లా షెడ్యూల్ కులాల అధికారి మోహన్ రామ్, మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్, పబ్లిక్ హెల్త్ అధికారి నరసింహ, బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..



భక్త కనకదాస చిత్రపటానికి నివాళులర్పించిన పోలీసు అధికారులు

పుట్టపర్తిరూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శనివారం ఏ ఆర్ డీఎస్పీ శ్రీనివాసులు భక్త కనకదాస చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్త కనకదాస సమాజంలో సమానత్వం, మానవత్వ విలువలను కాపాడిన మహానుబావుడని కొనియాడారు. కార్యక్రమంలో సీఐలు రాఘవన్, మోహన్, ఆర్ఐలు మహేశ్, వలి, రవికుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి శతజయంతికి ప్రధాని

సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు హాజరవుతారని కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. ఎస్పీ సతీష్ కుమార్‌తో కలిసి భద్రతా ఏర్పాట్లపై శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఆర్డీఓలు సువర్ణ, వీవీఎస్ శర్మ, మహేష్, ఆనంద కుమార్, ఆర్డీఓ కరుణసాగర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్, పబ్లిక్ హెల్త్ డీఈ నరసింహ, తహసీల్దార్ కళ్యాణ్ తదితరులకు పలు సూచనలు చేశారు. (వివరాలు మెయిన్‌లో)



సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ప్రతినిధులు, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్



శివుడికి రుద్రాభిషేకం చేస్తున్న విదేశీయులు

శివుడి సేవలో విదేశీయులు

- పార్శ్వలింగేశ్వర ఆలయంలో రుద్రాభిషేకం

ముదిగుబ్బ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దొరిగల్లు రోడ్డులో వెలసిన పార్శ్వ లింగేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం విదేశీయులు శివుడికి రుద్రాభిషేకం చేశారు. జర్మనీ నుంచి వచ్చిన హెర్బట్టు, ఇవంక, హెల్గాశాంతి, యాగస్ కార్తీక మాసం సందర్భంగా శివుడికి రుద్రాభిషేకం చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. హిందూధర్మం ఎంతో గొప్పదని, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న తర్వాత మనసు ప్రశాంతంగా ఉందని విదేశీయులు కొనియాడారు. అనంతరం దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో విదేశీయులను పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్శ్వ లింగేశ్వరస్వామి దేవస్థానం అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, సభ్యులు బొగ్గు రాజశేఖర్, గోపీనాథ్, అన్నమనేని చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో అఖండ భజన ప్రారంభం

6

తిరుమలలో కనకదాస పీఠం

- మంత్రి సవిత

మెరుగు దిద్దేదెవరు..?



వృత్తి పనిలో స్వర్ణకారుడు

దుర్భరంగా స్వర్ణకారుల జీవితాలు

- రెడీమేడ్ దుకాణాల రాకతో తగ్గిన ఆదరణ
- ఉపాధి కోసం స్థానిక స్వర్ణకారుల అవస్థలు

కదిరి అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాల తయారీలో కార్పొరేట్ కల్చర్ పెరిగిపోవడంతో స్థానిక స్వర్ణకారుల బతుకులు భారంగా మారాయి. అధునాతన యంత్రాలతో మగువలను ఆకర్షించే రీతిలో కార్పొరేట్ సంస్థలు ఆభరణాలు తయారు చేస్తుండటం స్థానిక స్వర్ణకారుల ఉపాధికి గండి కొడుతోంది. ఒకప్పుడు ఆభరణాల తయారీకి స్వర్ణకారుల వద్దకు క్యూ కట్టే ప్రజలు నేడు రెడీమేడ్ దుకాణాల వైపు పరుగులు పెడుతున్నారు. దీంతో పెళ్లిళ్ల సీజన్‌లో కొందరు స్వర్ణకారులు తప్ప మిగతా పనుల్లేకుండా షాపుల ముందు ఖాళీగా కూర్చునే పరిస్థితి దాపురించింది. దీంతో పాత నగలు మరమ్మతులు చేసుకుంటూ కాలం గడుపుతున్నారు.

పొరుగు రాష్ట్రాల కార్మికులతో పోటీ

రెడీమేడ్ నగల దుకాణాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి వలస వచ్చిన స్వర్ణకారులు స్థానికులకు పోటీగా మారారు. పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ తదితర ప్రాంతాల నుంచి యంత్రాలపై ఆభరణాల తయారీలో నైపుణ్యంగల కార్మికులను దుకాణాల యాజమాన్యాలు, కార్పొరేట్ సంస్థలు (మిగతా 6లో...)

పస్తులు ఉంటున్నాం: షఫీ, స్వర్ణకారుడు



వినియోగదారుడు బంగారు వస్తువులు తయారు చేయించుకోవడం లేదు. రెడీమేడ్ వస్తువులకే ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో స్వర్ణకారులు పనుల్లేక పస్తులుండాల్సి వస్తోంది. రెడీమేడ్ వస్తువుల్లో నాణ్యత పెద్దగా ఉండదు. మా పెద్దల నుంచి ఈ వృత్తిపైనే జీవనం సాగిస్తున్నాం. సరైన సంపాదన లేక పోయిన వదులుకోలేక ఇందులోనే కొనసాగుతున్నాం. ప్రభుత్వాలు కల్పించుకుని మా బతుకులు మెరుగు దిద్దాలి.

ఈ-శ్రమ్‌పై అవగాహన ఏదీ?

- ఉచిత ప్రమాద బీమా పథకానికి అరకొర స్పందన
- అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం
- లబ్ధి కోల్పోతున్న అసంఘటిత కార్మికులు

6

పల్లెలకూ చెత్త సేకరణ బండ్లు

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాం



పురం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్

హిందూపురం, మడకశిర టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల స్వచ్ఛత కూడా ప్రభుత్వ లక్ష్యమని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాం అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో చెత్త సేకరణకూ ఎలక్ట్రిక్ వాహనాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. హిందూపురం, మడకశిరలో ఆయన శనివారం పర్యటించారు. మోతుకపల్లి వద్ద పాత డంప్‌యార్డ్‌లో రీసైక్లింగ్ పనులు పరిశీలించారు. గుడ్డంపల్లి వద్ద నూతన డంప్‌యార్డ్‌ను పరిశీలించారు. పురం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష జరిపారు. స్వచ్ఛతలో హిందూపురం 70వ స్థానంలో ఉందని, పరిస్థితిని మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. ఎన్టీఆర్, హరికృష్ణ, బాలకృష్ణను ఆదరించిన హిందూపురం అంటే టీడీపీకి అభిమానమని అన్నారు. మోతుకపల్లి వద్ద డంప్‌యార్డును శుభ్రంచేసి, ఎన్టీఆర్ పేరిట పార్కును అభివృద్ధి చేస్తామని అన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ సూచనమేరకే తాను హిందూపురానికి వచ్చానని అన్నారు. మరోసారి హిందూపురానికి వచ్చేసరికి పరిశుభ్రతలో మంచి ర్యాంకులో ఉండాలని అన్నారు. వైసీపీ హయాంలో చెత్త పేరుకుపోయిందని, చెత్తపై పన్ను వేయడం పట్ల చూపిన శ్రద్ధ చెత్తను తరలించడంలో చూపలేదని విమర్శించారు. చెత్తను శుభ్రం చేసే ప్లాంటును హిందూపురానికి ఒకటి, మూడు మండలాలకు కలిపి మరొకటి త్వరలో మంజూరు చేస్తామని తెలిపారు. రీసైక్లింగ్‌లో వెలుబడిన ప్లాస్టిక్ వ్యర్థాన్ని సిమెంటు పరిశ్రమకు తరలించాలని, ఎవరైనా తిరస్కరిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున, టీడీపీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పీఏ వీరయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేష్ డైరెక్టర్లు పర్వీన్ బాను, మంజునాథ్, భవానీ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్, చంద్రమోహన్, టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులిస్తాం..

మడకశిరను తన సొంత నియోజకవర్గంగా భావిస్తున్నానని పట్టాభిరామ్ అన్నారు. నగర పంచాయతీ, ఐదు మండలాలల్లోని 67 పంచాయతీలకు స్వచ్ఛత మిషన్ ద్వారా నిధులను అందిస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలో రెండు ఎకరాల్లో డంపింగ్ యార్డ్‌ను శుభ్రం చేశారని, అందులో పార్కు, క్రీడా మైదానం, పిల్లలకు అవసరమైన ఆట వస్తువులను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా సమకూరుస్తామని తెలిపారు. మడకశిరలో ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజుతో కలిసి శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు, కమీషనర్ జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.


వెయ్.. చిందెయ్..


చిన్నారిని పలకరిస్తూ..



ప్రసంగిస్తున్న లోకేశ్


అందరికీ నమస్కారం..


లోకేశ్‌కు జ్ఞాపిక..

కురుబలను గుండెల్లో పెట్టుకుంటాం


సెల్ఫీ...

(5వ పేజీ తరువాయి)

మంత్రి నారా లోకేశ్ ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా మహిళలు కలశాలు చేపట్టి రాగా, గొరవయ్యల ఆటపాటలు, కాంతార నృత్యాలు అక్కడున్న ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విగ్రహావిష్కరణ అనంతరం మంత్రి మంత్రి లోకేశ్ మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలు అన్ని విధాలుగా టీడీపీకి అండగా నిలిచారన్నారు. ఇప్పుడు మేము బీసీలను బలోపేతం చేయడానికి అన్ని విధాలా కృషి చేస్తున్నామన్నారు. మహాభక్తుడు కనకదాస జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకోవడం, విగ్రహావిష్కరణ చేయడం జీవితంలో మరచిపోలేనన్నారు. కురుబ సోదరులతో కలిసి జయంతి వేడుకలు జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు వెల్లడించారు.

రుణపడి ఉంటాం

ఉమ్మడి జిల్లాకు ఎప్పుడూ రుణపడి ఉంటామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. దివంగత ఎన్టీఆర్‌ను మూడు సార్లు, మా మేనమామలు నందమూరి హరికృష్ణను ఒకసారి, బాలకృష్ణను మూడుసార్లు గెలిపించి అసెంబ్లీకి పంపిన గొప్ప నేల ఉమ్మడి అనంతపురం జిల్లా అన్నారు. ఈ నేలకు మేము ఎంత చేసినా తక్కువేనని, మా జీవితాంతం మీకు రుణపడి వుంటామన్నారు. ఈ ప్రాంత సమస్యలను పరిష్కరించేందుకు అహర్నిశలూ కృషి చేస్తామన్నారు. ఈ క్రమంలోనే జిల్లా ప్రజల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్న ఆర్డీటీ సంస్థకు కూడా కేంద్రంతో మాట్లాడి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించినట్లు వెల్లడించారు.


కనకదాస విగ్రహం వద్ద మంత్రులు లోకేశ్, సవిత, ఎమ్మెల్యే అమిలినేని

సులు, ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, బండారు శ్రావణి, పల్లె సింధూరరెడ్డి, ఎంఎస్ రాజు, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, కందికుంట వెంకట ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, కలెక్టర్ ఆనంద్, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ శాఖ ఎక్స్ ఆఫీషియో సెక్రెటరీ సత్యనారాయణ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ దేవేంద్రప్ప, కడప రీజనల్ ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ పూలనాగరాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, బీసీ వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి, బీసీ కార్పొరేషన్ ఏడీ రామసుబ్బారెడ్డి, ఆయా శాఖల అధికారులు, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

- కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని ఏపీ కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ ప్రతినిధులు మంత్రికి విజ్ఞప్తి చేశారు.
- కళ్యాణదుర్గం మండలంలోని మౌక్తికాపురంలో ముస్లిం మైనార్టీల శ్మశానాన్ని ఆక్రమించిన ముద్దినాయనపల్లికి చెందిన అశోక్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.
- శ్రీ సత్యసాయి వాటర్ సప్లై ప్రాజెక్టులో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిబ్బంది మంత్రి లోకేశ్‌ను కలిసి కోరారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.


మహిళా కార్యకర్త చిందులు..

నీతి, నిజాయతీలకు మారుపేరు కురుబలు: మంత్రి సవిత



సభలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి బీసీలంతా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో బీసీల పక్షపాతిగా పనిచేస్తున్న మంత్రి నారా లోకేశ్‌కు అభినందనలు తెలిపారు. కురుబ కులస్థులు నీతి, నిజాయతీకు మారుపేరుగా నిలిచారన్నారు. రాయలసీమలో అధికంగా ఉన్న కురుబ కులస్థులను గుర్తించి వారి ఆరాధ్య దైవం భక్త కనకదాస జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే సురేంద్ర బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదాస విగ్రహాన్ని మంత్రి లోకేశ్ చేతులమీదుగా విష్కరించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు కురుబలకు పెద్దపీట వేస్తున్నారని, ఈక్రమంలోనే గొర్రెలకు త్వరలోనే ప్రభుత్వం నుంచి బీమా వర్తింపజేయనున్నట్లు తెలిపారు. ఆదరణ-1, ఆదరణ-2 తెచ్చింది చంద్రబాబునాయుడేనని ప్రశంసించారు.

బీసీ భవన్ మంజూరు చేయాలి: ఎంపీ బీకే పార్థసారథి



అనంతరం హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి మాట్లాడుతూ భక్త కనకదాస 538వ జయంతి వేడుకలను యువనేత మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో రాష్ట్ర పండుగగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. బీసీలకు 2024లో రెండు లోక్‌సభ, శాసనసభ పదవులిచ్చారన్నారు. భవిష్యత్తులో మరింతమందికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా అవకాశం ఇవ్వాలని కోరారు. ఎన్టీఆర్ హయాం నుంచి కురుబలను ఆదుకున్న పార్టీ టీడీపీనేనన్నారు. కుప్పంలో రూ. 5 కోట్లతో బీసీలకు కల్యాణ మండపాన్ని నిర్మించారన్నారు. ఉమ్మడి జిల్లాలో తొమ్మిది కల్యాణ మండపాలు నిర్మించుకున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో బీసీ భవన్‌లను మంజూరు చేయాలని కోరారు.

కరువు సీమలో కార్ల పంట

కరువు సీమగా పేరు గడించిన ఉమ్మడి జిల్లాలో కార్ల పంట పండించిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనన్నారు. నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు తెస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో హార్టికల్చర్‌కు సాయం అందిస్తామన్నారు. తలసరి ఆదాయంలో 5వ స్థానంలో ఉన్న ఉమ్మడి జిల్లాను మూడో స్థానంలోకి తీసుకువస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీతోనే బీసీలకు రాజకీయ స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. 3132 కిలోమీటర్ల యువగళం పాదయాత్ర చేసినప్పుడు అన్ని కులాలకు సంబంధించిన సమస్యలను నేరుగా తెలుసుకున్నానని, వాటిని పరిష్కరించేంత వరకు విశ్రమించనని తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చెప్పిన పనులన్నీ పూర్తయ్యేవరకు వదిలిపెట్టరని, ఆమె పట్టుదల వల్ల బీసీల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ బీకే పార్థసారథి కేంద్రంతో మాట్లాడుతూ నిధులు తీసుకువచ్చేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలకు కురుబలకు అనుసంధానం చేసి అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, పార్థసారథి, కర్నూలు ఎంపీ నాగరాజు, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివా


ర్యాలీలో మంత్రి పయ్యావుల, ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

విన్నపాలు వినవలె..!



కళ్యాణదుర్గం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తన రెండు రోజుల పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్ శనివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహించారు. తనను కలిసేందుకు వచ్చిన ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించారు. వివిధ సమస్యలపై ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు.

- బతుకుదెరువు కోసం మస్కట్ వెళ్లిన తన సోదరి షేక్ జుబేదా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, సరైన తిండి లేక అనారోగ్యం పాలైన ఆమెను క్షేమంగా స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని గుంతకల్లుకు చెందిన షేక్ షబానా మంత్రికి విన్నవించారు.
- తన ఇద్దరు కుమార్తెల ఉన్నత చదువుల కోసం ఆర్థిక సాయం అందించాలని అనంతపురంకు చెందిన మదమంచి ప్రవీణ్ కుమార్ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి కోరారు.


వృద్ధులు, మహిళల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి లోకేశ్


కళాకారుల ప్రదర్శన

బీటీపీ కాలువ పనులు పూర్తి చేయండి: ఎమ్మెల్యే అమిలినేని

బీటీపీ(భైరవానితిప్ప ప్రాజెక్టు) కాలువ పనులు పూర్తి చేసి, రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మంత్రి నారా లోకేశ్‌కు శనివారం విన్నవించారు. దీనికి కనకదాస జయంతి సభలోనే మంత్రి లోకేశ్ స్పందించారు. బీటీపీ కాలువ పనులకు శంకుస్థాపన చేసింది టీడీపీ హయాంలోనేనని, ఇప్పుడు పూర్తి చేసేది కూడా మన ప్రభుత్వమే అని పేర్కొన్నారు. దీంతో సభలో హర్షధ్వానాలు మార్మోగాయి. సభలో ఎమ్మెల్యే అమిలినేని మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మంత్రి లోకేశ్ రెండు రోజుల పర్యటన చేపట్టడం సంతోషకరంగా ఉందన్నారు. తాము పిలిచిన వెంటనే కళ్యాణదుర్గంలో తొమ్మిది అడుగుల కనకదాస కాంస్య విగ్రహావిష్కరణకు మంత్రి నారా లోకేశ్ విచ్చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కురుబ కులస్థుల మనసు పాల వంటి స్వచ్ఛమైనదని, వారి అభివృద్ధికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

మంత్రి నారా లోకేశ్‌కు వినతుల వెల్లువ


మంత్రికి వినతిప్రతం ఇస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

అనంతపురం క్రైం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధుల నుంచి వినతులు వెల్లువెత్తాయి. కళ్యాణదుర్గానికి వచ్చిన ఆయనను శనివారం కళ్యాణదుర్గం, పుట్టపర్తి ఎయిర్‌పోర్టులో నేతలు కలిసి సమస్యలు విన్నవించారు. విప్ కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మంత్రిని పుట్టపర్తి ఎయిర్‌పోర్టులో కలిశారు. వాల్మీకి బోయలను ఎస్టీల జాబితాలో చేర్చే ప్రక్రియ వేగవంతమయ్యేలా చూడాలని కోరారు. 2016లోనే చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ సత్యపాల్ ఏకసభ్య కమిషన్‌ను నియమించి ఈ సమస్యపై సమగ్రంగా అధ్యయనం చేయించిందన్నారు. ఆ కమిటీ ఏపీలో పర్యటించి బోయలను ఎస్టీల్లో చేర్చేలా సిఫార్సు చేసిందన్నారు. 2017లో అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినట్టు తెలిపారు. వాల్మీకి బోయ సమాజ పరిస్థితిపై సానుకూల దృక్పథంతో ఆలోచించి కేంద్రం వ్యక్తం చేసిన ఆరు అంశాలపై త్వరితగతిని అధికారుల ద్వారా కేంద్రానికి నివేదిక అందేలా చూడాలని మంత్రికి వినతిపత్రం అందించారు.

ఆర్డీటీకి హామీపై కృతజ్ఞతలు

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ రెన్యువల్ కోసం కృషి చేసిన మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. కళ్యాణదుర్గంలో మంత్రి నారా లోకేశ్‌ను సహచర ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి కలిశారు. కనదాస విగ్రహావిష్కరణ తర్వాత ఆయన మంత్రి లోకేశ్‌తో మాట్లాడారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ సమస్య తీవ్రంగా ఉన్న సమయంలో మంత్రి లోకేశ్ చొరవ చూపారన్నారు. ఆ సంస్థకు రెన్యువల్‌కు హామీతోపాటు, మరింత ప్రోత్సాహకం ఇస్తామని చెప్పడం సంతోషకరమన్నారు. ప్రభుత్వం సేవ చేసేవారికి, పేదల పక్షాన నిలబడుతుందని చెప్పడానికి ఈ సంఘటనే ఉదాహరణ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి లోకేశ్‌తో ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు

తిరుమలలో కనకదాస పీఠం : మంత్రి సవిత


మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాస పీఠాన్ని తిరుమలలో ఏర్పాటు చేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. కనకదాస 538వ జయంతిని పురస్కరించుకుని పెనుకొండలోని మిట్ట ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న కనకదాస విగ్రహానికి ఆమె శనివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కురుబలకు, బీసీలకు ఆదరణ -3 లబ్ధి త్వరలో చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, శ్రీనివాసులు, బీజేపీ రామక్రిష్ణ, రఘువీరచౌదరి, శ్రీరాములు, బాబుల్‌రెడ్డి, రవీ, కృష్ణమూర్తి, అరుణ్‌రెడ్డి, షౌకత్, రమణమ్మ, బేబి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో అఖండ భజన ప్రారంభం


అలంకరణలో బాబా మహాసమాధి


అఖండ భజనలో భక్తులు

పుట్టపర్తి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాలులో శనివారం సాయంత్రం 6 గంటలకు అఖండ భజన ప్రారంభమయింది. సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులు వేద పఠనంతో అఖండ భజన ప్రారంభమైంది. సత్యసాయి ప్రేమతత్వంపై భక్తి పాటలు ఆలాపన చేపట్టారు. శ్రీసత్యసాయి శతజయంతి వేడుకలకు ముందస్తుగా శనివారం అఖండ భజన చేపట్టారు. అఖండ భజన 24 గంటల పాటు ఏకధాటిగా సాగి ఆదివారం సాయంత్రం 6 గంటలకు మంగళహారతితో ముగుస్తుంది. మొదటి రోజు అఖండ భజనలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్‌పై అవగాహన ఏదీ?

ఉచిత ప్రమాద బీమా పథకానికి అరకొర స్పందన

అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం

లబ్ధి కోల్పోతున్న అసంఘటిత కార్మికులు

కొత్తచెరువు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికుల కోసం అమలు చేస్తున్న ఉచిత బీమా పథకం ఈ-శ్రమ్. ఈ కార్డు పొందడం ద్వారా లబ్ధిదారులకు అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. అయితే దీని గురించి సరైన ప్రచారం లేకపోవడంతో అనేకమంది ఈ పథకానికి దూరంగా ఉన్నారు. ఈ-శ్రమ్ కార్డు ఉన్న వారికి ఉచితంగా రూ. రెండు లక్షల ప్రమాద బీమా లభిస్తుంది. అలాగే పనిముట్లు, కుట్టుమిషన్లు, వారి పిల్లలకు ఉచితంగా సైకిళ్లు ప్రభుత్వం నుంచి అందుతాయి. అయినా కార్మికులు ఈ పథకాల వైపు మక్కువచూపక పోవడానికి ప్రధాన కారణం అవగాహన లేకపోవడమే.

అర్హులు వీరే

పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, రోజువారి కూలీలు, వీధి వ్యాపారులు, భవన నిర్మాణ కార్మికులు, ఉపాధి కూలీలు, రైతు కూలీలు, తక్కువ వేతనం అనగా రూ.15వేల లోపు ఉన్న కార్మికులు, పీఎఫ్, ఈఎస్‌ఐ, ఆదాయపు పన్ను చెల్లించని వారు అర్హులని జిల్లా లేబర్ అధికారి సూర్యనారాయణ తెలిపారు. ఈ-శ్రమ్ కార్డుకు దరఖాస్తు చేసుకునే వారికి 18 నుంచి 59 సంవత్సరాల మధ్య



ఈ శ్రామ్ కారు (ఫైల్)

వయస్సు ఉండాలి. రేషన్, ఆధార్ కార్డును ఈ-శ్రమ్ కార్డుతో అనుసంధానం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని కార్మిక సంక్షేమశాఖ అధికారులు చెబుతున్నారు.

దరఖాస్తు ఇలా..

- ఈ శ్రమ్ కార్డు పొందడానికి మొదట ఆధార్‌కార్డుకు మొబైల్ నంబర్ లింకై ఉండాలి.
- గ్రామ, వార్డు సచివాలయాలు, ఇంటర్‌నెట్ సెంటర్, మీసేవ సెంటర్, సీఎస్‌సీ సెంటర్లల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేయగానే మొబైల్‌కు వచ్చే ఓటీపీ నంబర్‌ని ఎంటర్‌చేసి లాగిన్ అవ్వాల్సి ఉంటుంది.
- తర్వాత చిరునామా, విద్యార్హత, ఏ పనిలో నైపుణ్యం ఉంది, పని స్వభావంతో పాటు, బ్యాంకు అకౌంట్ తదితర వివరాలు నమోదు చేయాలి.
- చివరగా ధ్రువీకరణ కోసం మొబైల్‌కు వచ్చిన ఓటీపీని నమోదు చేయాలి. అనంతరం 12 అంకెలు గుర్తింపు కార్డు మంజూరవుతుంది. తర్వాత మంజూరైన కార్డును కార్మికులు డౌన్‌లోడ్ చేసుకొని భద్రపరుచుకోవాలి.

ప్రయోజనాలు ఇవే...

అసంఘటిత కార్మికులు ప్రమాదశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.2 లక్షల బీమా అందజేస్తారు. అలాగే శాశ్వత వైకల్యం పొందితే రూ. లక్ష వరకు అందుతుంది. పీఎం ఆవాస్ యోజన కింద ఉచిత గృహ నిర్మాణానికి రూ.1.2 లక్షలు, 60 సంవత్సరాలు నిండిన కార్మికులకు పీఎం శ్రమయోగి మాన్‌ధన్ యోజన కింద నెలకు రూ.3 వేల పెన్షన్ అందుతుంది. అర్హత కల్గిన కార్మికుల పిల్లలకు విద్య, వివాహానికి సాయం అందుతుంది. హెల్త్ కేర్ కింద అర్హత కలిగిన కార్మికులకు ఆయుష్మాన్ భారత్ పథకం కింద ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సాయం లభిస్తుంది. స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కింద పీఎం కౌశల్ వికాస్ యోజన కింద శిక్షణని అందించడంతో పాటు నెలకు రూ.8 వేల వరకు స్టైఫండ్‌నుకూడా ప్రభుత్వమే అందిస్తుంది.

అవగాహన కల్పిస్తున్నాం



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ- శ్రమ్ కార్డు, లేబర్‌కార్డులపై కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు, ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో 3 లక్షల వరకు అసంఘటిత కార్మికులు ఉన్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 64,100 మందికి ఈ శ్రమ్ కార్డులను అందజేశాం.

\- సూర్యనారాయణ, జిల్లా కార్మిక శాఖ అధికారి

మెరుగు దిద్దేదెవరు..?

(5వ పేజీ తరువాయి)

తీసుకొస్తున్నాయి. దీంతో ఎన్నో ఏళ్ల నుంచి ఈ వృత్తినే నమ్ముకున్న స్వర్ణకారులకు పని లేకుండాపోతోంది. పనులు లేక పూట గడవని పరిస్థితుల్లో ఉన్నామని పలువురు స్వర్ణకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పడుతున్న కష్టాలు తమ పిల్లలకు రాకూడదని వేరే వృత్తిలోకి పంపుతున్నట్లు పేర్కొన్నారు. కుటుంబజీవనం కోసం కొందరు బ్యాంకులు లేదా బంగారంపై అప్పు ఇచ్చే వ్యక్తుల వద్ద అప్రైజర్లుగా చేరిపోయారు.

పెట్టుబడి ఏదీ?

అన్ని వృత్తుల మాదిరిగానే ఆభరణాల తయారీలో కూడా ఆధునికత పెరిగిపోయింది. ప్రతి చిన్న పని యంత్రాల సాయంతోనే చేయాల్సి వస్తోంది. కానీ వాటిని సమకూర్చుకునే స్తోమత లేని స్థానిక స్వర్ణకారులు చిన్నపాటి పరికరాలతోనే నెట్టుకొస్తున్నారు. కొద్దోగొప్పో డబ్బులు వెచ్చించి చిన్నపాటి యంత్రాలు కొందామన్నా ఎక్కువ మందికి ఆర్థిక పరిస్థితులు అనుకూలించడం లేదని చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 700 పైగా స్వర్ణకారులు ఉన్నట్లు తెలుస్తోంది. అన్నీ సామాజిక వర్గాలవారు ఈ వృత్తిలో జీవనం సాగిస్తున్నారు.

రుణం ఇవ్వాలి: సుబ్బాచారి, స్వర్ణకారుడు



బంగారు ఆభరణాల తయారీ యంత్రాలు చాలు ఖరీదైనవి. కొనుక్కుని బతుకుదామంటే ఆర్థిక పరిస్థితులు సహకరించడం లేదు. ముద్రా రుణాలు మంజూరు చేయలని కోరుతున్నా బ్యాంకులు స్పందించడం లేదు. పూచీకత్తు లేనిదే రుణాలు ఇవ్వడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ వృత్తిలో ఎలా ముందుకు వెళ్లగలం. ప్రభుత్వం స్పందించి రుణాలు అందించాలి.

బ్యాంకులో అప్రైజర్‌గా పని చేస్తున్నా: అరుణ్‌కుమార్, స్వర్ణకారుడు



బంగారానికి మెరుగులు దిద్ది ఆభరణాలు తయారు చేసే స్వర్ణకారుల జీవితాలు ప్రస్తుతం కళాహీనంగా మారాయి. కార్పొరేట్ షాపుల రాకతో రెడీమేడ్ నగలకు గిరాకీ పెరిగింది. ఒకప్పుడు ఆభరణాలు కావాలంటే ముందుగా ఆర్డర్లు ఇచ్చి ప్రత్యేకంగా చేయించేవారు. చేతినిండా పని ఉండేది. ఆదాయమూ బాగుండేది. ప్రస్తుతం యంత్రాలతో చేసిన ఆభరణాలకు డిమాండ్ పెరిగింది. చేతిలో పనిలేక బ్యాంకులో అప్రైజర్‌గా పనిచేస్తున్నా. వీటిలో కూడా ఆధునిక యంత్రాలు వచ్చే అవకాశం ఉందంటున్నారు. ప్రభుత్వం ఉపాధి చూపించాలి.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ఆధునిక యంత్ర సామగ్రి లేకపోవడంతో స్వర్ణకారులు వృత్తిలో నైపుణ్యం సాధించలేకపోతున్నారు. నగల తయారీలో వాడే రసాయనాలు ఆరోగ్యాన్ని పాడు చేస్తున్నాయి. వ్యాపారం, వృత్తిలో నైపుణ్యం పెంచుకునేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. అసంఘటిత కార్మికులుగా గుర్తించి హెల్త్‌కార్డులు మంజూరు చేయాలి. ఐటీఐ తరహాలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి ఆధునిక యంత్రాలపై శిక్షణ ఇవ్వాలి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న రెడీమేడ్ ఆభరణాల వ్యాపారాన్ని నియంత్రించాలి. స్వర్ణకారులకు రూ.4 వేల పింఛన్ ఇచ్చి ఆదుకోవాలి.

\- డంకణాచారి, స్వర్ణకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు



మాట్లాడుతున్న ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్



పోటీల్లో పాల్గొంటున్న అనంతపురం జిల్లా రెవెన్యూ ఉద్యోగులు



టేబుల్ టెన్నిస్ ఆడుతున్న జేసీ శివనారాయణ శర్మ

రెవెన్యూ క్రీడాపోటీలు అభినందనీయం



(5వ పేజీ తరువాయి)

పాటు మానసిక దృఢత్వం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, ఆర్డీఓ మలోలా, ఎఫ్ఎస్ఓ రామకృష్ణారెడ్డి, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వెంకట రాజేష్, రెండు జిల్లాల అధ్యక్షులు దివాకర్ రావు, మధునాయక్, ఆర్డీఓలు కేశవనాయుడు, విశ్వనాథ్‌చౌదరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జునుడు, ఆనంద్, రామ్మోహన్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

● వాలీబాల్ సెమీస్ పోటీల్లో విశాఖపట్నం జట్టుపై నంద్యాల గెలుపొందింది. మరో సెమీస్‌లో పార్వతీపురం జట్టుపై తూర్పు గోదావరి జట్టు విజయం సాధించింది. ఫైనల్స్‌లో నంద్యాల విజేతగా నిలిచింది.

- బ్యాడ్మింటన్ పోటీల్లో డబుల్స్‌లో విజయనగరంపై అన్నమయ్య, తిరుపతిపై తూర్పుగోదావరి జట్టు, సీసీఎల్‌ఏపై కాకినాడ జట్టు గెలుపొందాయి.

● పురుషుల సింగిల్స్‌లో కడపపై ప్రకాశం, తిరుపతిపై అంబేడ్కర్ కోనసీమ జట్టు గెలుపొంది ఫైనల్‌కు చేరాయి.

● మహిళల డబుల్స్‌లో అల్లూరి సీతారామ రాజు జట్టుపై విజయనగరం, కడప జట్టుపై అనంతపురం గెలుపొంది ఫైనల్‌కు చేరాయి.

● మహిళా సింగిల్స్‌లో బాపట్లపై ప్రకాశం, అల్లూరి సీతారామరాజు జట్టుపై కాకినాడ, శ్రీకాకుళంపై తూర్పుగోదావరి జట్టు గెలుపొందాయి.

● టెన్నీకాయిట్‌లో విజయనగరంపై విశాఖపట్నం జట్టు గెలుపొందింది. అన్నమయ్యపై చిత్తూరు, అనంతపురంపై బాపట్ల, అనకాపల్లిపై కర్నూలు గెలుపొందాయి.

● టేబుల్‌టెన్నిస్ సింగిల్స్ పోటీల్లో అల్లూరి సీతారామరాజుపై అనంతపురం ఫారెస్ట్‌సెటిల్‌మెంట్ ఆఫీసర్ రామకృష్ణారెడ్డి విజయం సాధించారు. డబుల్స్‌లో అల్లూరి సీతారామరాజు జట్టుపై అనంతపురం గెలిచింది.

● టీటీ మహిళల సింగిల్స్‌లో కర్నూలుపై కడప గెలిచింది. డబుల్స్‌లో కడప జట్టుపై కర్నూలు గెలుపొందింది.

● క్యారమ్స్‌లో మొదటి సెమీస్‌లో బాపట్లపై నెల్లూరు, రెండో సెమీస్‌లో విజయనగరంపై సీసీఎల్‌ఏ జట్లు విజయం సాధించాయి.

● 45సంవత్సరాలుపైబడిన పురుషుల క్యారమ్స్‌లో అంబేడ్కర్ జిల్లాపై సీసీఎల్‌ఏ, బాపట్లపై చిత్తూరు, కర్నూలుపై అనంతపురం, పల్నాడుపై విజయనగరం జట్లు విజయం సాధించాయి.

● పురుషుల చెస్ పోటీల్లో కాకినాడపై బాపట్ల, మహిళా విభాగంలో విశాఖపట్నంపై శ్రీసత్యసాయి జిల్లా గెలిచింది.

● అథ్లెటిక్ పోటీల్లో మహిళా విభాగంలో 100మీటర్ల రిలేలో అనంతపురం, 100 మీటర్ల పరుగుపందెంలో అనంతపురం గెలుపొందాయి. ఈ పోటీలు ఆదివారం ముగియనున్నాయి. ముగింపు కార్యక్రమానికి రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతున్నట్లు బొజ్జ రాజు వెంకటేశ్వర్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కురాషా పోటీలు ప్రారంభం



ఎస్‌జీఎఫ్ కురాషా పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కురాషా పోటీలు శనివారం ప్రారంభమయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాప్తాడు సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 69వ ఏపీ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్-14, 17, 19 కురాషా చాంపియన్‌షిప్ పోటీలను మీనాక్షమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రమణ, పాఠశాల కరస్పాండెంట్ భరత్ ప్రారంభించారు. 13 ఉమ్మడి జిల్లాల నుంచి 400మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. రెండు రోజుల పాటు ఈ పోటీలు సాగనున్నాయి. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, శకుంతల, సుహాసిని, పీడీలు శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారెడ్డి, ప్రభాకర్, రాజశేఖర్ రెడ్డి, సుగుణమ్మ, శ్యామల, శ్రీదేవి, శిరీష, లీలారాణి, రమేష్, రాజశేఖర్, రామాంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన ఉమ్మడి జిల్లా ఫెన్సింగ్ క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా సీనియర్ ఫెన్సింగ్ క్రీడాకారులను శనివారం ఎంపిక చేశారు. స్థానిక కోవూరునగర్‌లోని విద్యారణ్య పాఠశాలలో ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపిక వివరాలను జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీ కృష్ణ, కార్యదర్శి పుష్పావతి తెలిపారు. బాలుర విభాగంలో సాయి సుధీంద్రపవన్, సాత్విక్, నవనీత్, అభినవ్, రాహుల్‌బాబు, ధ్యాన్‌ధీరజ్, సాయిసూర్య, కరీం, సుశృత్‌సింహ, పురంజయ్, మోహిత్‌రావు, రవికుమార్ ఎంపికయ్యారు.

● బాలికల విభాగంలో జాస్పర్, గీతిక, సృజన్, రిజ్వాన్, ప్రబంధ్, యశస్విని, లిఖిత, వినీల, సాయిదీక్షిత, రజియా, సునీతలు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 11న రాజమండ్రి నిర్వహించే రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ఉమ్మడి జిల్లా తరఫున పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు రానా ప్రతాప్, రాహుల్‌బాబు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రెజ్లింగ్ పోటీలకు ముగ్గురు ఎంపిక



లావణ్య



అనూష



జగన్నాథం రాఖీ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన పోటీల్లో జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు జాతీయ రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. డిసెంబరు 8వతేదీ నుంచి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బాలియా ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగే జాతీయ కుస్తీ పోటీలకు అనంతపురం నగరంలోని విరుపాక్షనగర్‌కు చెందిన నాగన్న, అంజినమ్మ దంపతుల కుమారుడు జగన్నాథం రాఖీ ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఇదే పోటీలకు పామిడికి చెందిన కృష్ణ, అనిత దంపతుల కుమార్తె అనూషా ప్రాతినిధ్యం వహించనుంది. పామిడి పట్టణానికి చెందిన దాసరి రాజేంద్ర, మహేశ్వరి దంపతుల కుమార్తె లావణ్య జనవరిలో ఢిల్లీలో జరిగే జాతీయ రెజ్లింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహించనుంది. ఈ మేరకు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, శాప్ రెజ్లింగ్ కోచ్ రాఘవేంద్ర జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

రవాణా అలవెన్స్ విడుదల

అనంతపురం విద్య, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల బాలికలకు రవాణా అలవెన్స్ నిధులు విడుదలైనట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ శనివారం తెలిపారు. జిల్లాలో 1125మంది ప్రత్యేక అవసరాలు గల బాలికలు భవిత కేంద్రాల ద్వారా వైద్యచికిత్సలు పొందుతున్నట్లు తెలిపారు. చికిత్సలకు హాజరయ్యే సమయంలో వీరి ప్రయాణానికి అయ్యే చార్జీలకు ప్రభుత్వం రవాణా అలవెన్స్ చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఈఏడాది జూన్ నుంచి అక్టోబరు నెల వరకు ఒక్కొక్కరికి రూ.1000లు చొప్పున అలవెన్స్ సొమ్మును వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ విషయం ఎంఈఓలు, హెచ్‌ఎంలు వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని ఆమె సూచించారు.

టమోటా కిలో రూ.21

అనంతపురం రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో శనివారం టామోటాలు కిలో గరిష్ఠంగా రూ.21తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.9తో, సరసరిగా రూ.14తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1950 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు అర్లయ్య



మాట్లాడుతున్న అర్లయ్య

కొత్తచెరువు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు అర్లయ్య తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో శ్రీ సత్యసాయి జిల్లా గ్రామ, వార్డు ఉద్యోగుల సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు చౌడప్ప ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు అర్లయ్య మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల సమస్యలైన నోషనల్ ఇంక్రిమెంట్ చెల్లింపు, స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ మంజూరు, డోర్ టూ డోర్ సర్వీసు నుంచి విముక్తి వంటి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సచివాల య ఉద్యోగులను గ్రామ, వార్డు సచివాలయ విధులకే పరిమితం చేయాలన్నారు. ప్రమోషన్ చానల్ ఏర్పాటు చేసి, బదిలీల్లో పారదర్శకత పాటించాలన్నారు. సెలవు, పండుగ దినాల్లో విధులకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను మినహాయించాలన్నారు. జీఓ నెంబరు 91 ప్రకారం రీ క్యాటగిరైజేషన్‌లో డిజిటల్ అసిస్టెంట్‌లకు జరుగుతున్న ఇబ్బందులను వెంటనే సరిదిద్దాలన్నారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి తరాలకు స్ఫూర్తి 'పప్పూరు'

కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి



నివాళులర్పిస్తున్న వేమన ఫౌండేషన్ ప్రతినిధులు

అనంతపురం టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు పప్పూరు రామాచార్యులు నేటితరాలకు స్ఫూర్తి అని కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి పేర్కొన్నారు. వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పప్పూరు రామాచార్యులు జయంతిని శనివారం జిల్లా కేంద్రంలో జరుపుకున్నారు. ఆ ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పప్పూరు రామాచార్యులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి హరినాథరెడ్డి మాట్లాడుతూ పప్పూరు రామాచార్యులు సాధన పత్రిక నిర్వహణ ద్వారా ఈ ప్రాంత సాహిత్య, సాంస్కృతిక వికాసంతోపాటు జాతీయోద్యమ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన విద్యార్థి దశలోనే వదరుబోతు కరపత్రాలు ప్రచురించి, అనంతపురం వీధుల్లో పంచేవారని, ఈ ప్రాంతంలో జర్నలిజం వికాసానికి పునాది వేశారన్నారు. అనంతపురం తొలి మున్సిపల్ ఛైర్మన్‌గా, గ్రంథాలయ అధ్యక్షుడిగా, కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్‌గా, లలితకళా పరిషత్, హరిజన సేవాసదన్, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల తదితర అనేక సంస్థలలో తనదైన ముద్ర వేశారని పేర్కొనారు. రాయలసీమ ప్రయోజనాలకోసం శ్రీబాగ్ ఒప్పంద సాధనలో పప్పూరు పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు శ్రీనివాసరెడ్డి, ప్రజాసంఘాల నాయకులు రమణ, రాహుల్, కవులు సూర్యం, నర్సిరెడ్డి, రవికుమార్, నాగేశారెడ్డి పాల్గొన్నారు.

సత్యసాయి శత జయంతి ఉత్సవాలకు రండి

ప్రజాప్రతినిధులకు సింధూరారెడ్డి, పల్లె రఘునాథరెడ్డి ఆహ్వానం

పుట్టపర్తిరూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి ఉత్సవాలకు రావాలని ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆహ్వానించారు. శనివారం మంత్రి నారా లోకేశ్ తిరుగు ప్రయాణంలో విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు వీడ్కోలు పలికేందుకు వచ్చిన ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పల్లె క్యాంపు కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీలు బీకే పార్థసారధి, అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్, ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, ఎంఎస్‌రాజు, బండారు శ్రావణిశ్రీ, దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, గుమ్మనూరు జయరాం, సత్యసాయి, అనంతపురం జిల్లాల టీడీపీ అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, వెంకటశివుడుయాదవ్, నెట్టెం వెంకటేసు, ముంటిమడుగు కేశవరెడ్డికి ఎమ్మెల్యే, మాజీమంత్రి ఆహ్వాన పత్రికలను అందచేశారు.



మంత్రి సవిత, ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, పల్లె రఘునాథరెడ్డి

రైళ్లల్లోకి మత్తు పదార్థాలు..!

యథేచ్ఛగా గుట్కా, మద్యం విక్రయాలు
నాసిరకపు తినుబండారాలు.. ఎక్కువ ధరలతో తాగునీరు
పట్టించుకోని ఆర్పీఎఫ్ పోలీసులు

గుంతకల్లు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రైళ్లల్లో మత్తుపదార్థాలు విచ్చలవిడిగా లభిస్తున్నాయి. జనరల్, స్లీపర్ క్లాస్ కంపార్ట్‌మెంట్లలో నేకాదు.. ఏసీ కోచ్‌లలో సైతం గుట్కా, సిగరెట్ల ప్యాకెట్లు, మద్యం సీసాలను సైతం నడుస్తున్న రైళ్లల్లోకి తీసుకువచ్చి యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. వాటిని అరికట్టాల్సిన ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు పట్టించుకోకపోవడంతో మత్తుపదార్థాలను బోగీల్లో విక్రయిస్తున్నారు. వీటితో పాటు చిన్నపిల్లలను లక్ష్యంగా చేసుకుని నాణ్యత లేని చిప్స్ ప్యాకెట్లు, నాసిరకపు తినుబండారాలను అమ్మేవారు రైళ్లల్లో ఎలాంటి అడ్డంకి లేకుండా తమ పని కానిచ్చేస్తున్నారు.

బహిరంగంగా గుట్కా విక్రయాలు

రాష్ట్రంలో గుట్కాపై నిషేధం ఉండటంతో రహస్యంగా విక్రయించడం చూస్తుంటాం. కానీ రైళ్లల్లో గుట్కా, సిగరెట్ ప్యాకెట్ల చేతిలో పట్టుకుని బహిరంగంగా అమ్ముతూ కనిపిస్తుండటంతో ప్రయాణికులు ఆశ్చర్యపోతున్నారు. కొందరు సంచిలో వేసుకుని 'గుట్కా.. గుట్కా..' అని అరుస్తూ అమ్ముతున్నారు. పల్లెటూరి జనం కనిపిస్తే దగ్గరకు వెళ్లి 'క్వార్టర్ కావాలా?' అంటూ అడిగి మరీ అమ్ముతున్నారు. ఉత్తరాది నుంచి వచ్చే రైళ్లల్లో గుట్కా అమ్మకపుదారులు ఏసీ బోగీల్లోకి సైతం వెళ్లి అమ్మి సొమ్ముచేసుకుంటున్నారు. గుంతకల్లుకు చెందిన ఓ వ్యక్తి కాలం తీరిన బిస్కెట్ ప్యాకెట్లు విక్రయిస్తూ ప్రయాణికుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నట్లు తెలుస్తోంది. భద్రతపై ఊకదంపుడు ప్రచారం చేసే రైల్వే శాఖ గుట్కా, మద్యం అమ్మకాలపై ఏమాత్రం పట్టించుకోకపోవడం శోచనీయం.

అధిక ధరలతో తినుబండారాలు

రైళ్లల్లో నాసిరకపు చిప్స్ ప్యాకెట్లను రూ. 30కు అమ్ముతున్నారు. బ్రాండెడ్ చిప్స్ ప్యాకెట్లే బయట రూ. 10లకు బయట లభిస్తుండగా.. చిన్నపిల్లలను లక్ష్యంగా చేసుకుని నాణ్యతలేని ప్యాక్ చిప్స్‌ను మూడింతల ధరలతో విక్రయిస్తున్నారు. రైళ్లల్లో రూ. 15తో విక్రయించాల్సిన బ్రాండెడ్ తాగునీటి బాటిళ్లను రూ. 20కు అమ్ముతున్నారు. ఆ బాటిళ్ల కూడా అత్యంత నాసిరకపు ప్యాకింగ్ కలిగి ఉండటం, రుచి కూడా పంపు నీళ్ల మాదిరిగా ఉంటున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ నీటి బాటిళ్లను రైళ్లలోని ప్యాంట్రీ కార్‌లోని క్యాటరింగ్ సిబ్బందే అమ్ముతుండటం గమనార్హం. ప్యాంట్రీ కార్‌లో అమ్మే ఆహారం కూడా అత్యంత ఘోరంగా ఉంటోందని ప్రయాణికులు వాపోతున్నా రు. ఇవే కాకుండా బయట వ్యక్తులు రైలు బోగీల్లోకి వచ్చి నా ణ్యతలేని బిస్కెట్ ప్యాకెట్లను, నాసిరకపు ఇతర తినుబండారాలను పోలీసులు బీట్లు తిరిగే రాత్రి వేళల్లో సైతం అమ్ముతున్నారు.

మామూళ్ల మత్తు

తనిఖీ చేయాల్సిన ఆర్పీఎఫ్ సిబ్బందికి మామూళ్లను ముట్టజెబుతూ రైళ్లలో మత్తుపదార్థాలను అమ్ముతున్నారని ఆరోపణలు ఉన్నాయి. రాయచూరు, బళ్లారి, డోన్, ధర్మవరం, నంద్యాల ప్రాంతాల నుంచి అమ్మకపుదారులు గుట్కా, సిగరెట్ ప్యాకెట్లు, చీప్‌లిక్కర్, నాసిరకపు ఆహారాన్ని రైళ్లల్లోకి తెస్తున్నారు. వీరు గుంతకల్లు వరకూ ప్రయాణించి అమ్మకాలు చేస్తున్నారు. గుంతకల్లు స్టేషన్ సమీపించగానే బెర్తుల కింద తమ సరుకును దాచిపెట్టుకుంటారు. రైలు కదలగానే మళ్లీ బోగీల్లో అమ్మకాలు సాగిస్తారు. ఉదయం తయారుచేసిన సమోసాలను రాత్రివరకూ అమ్ముతున్నారు. ప్రయాణికులు గత్యంతరంలేక తిని అనారోగ్యాల పాలవుతున్నారు. ఈ అక్రమాలను అడ్డుకోవాల్సిన ఆర్పీఎఫ్ సిబ్బంది చూ సీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం

రైళ్లల్లో గుట్కా, సిగరెట్, తదితర వస్తువుల విక్రయాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. గుంతకల్లు స్టేషన్ సమీపించినా, పోలీసులు, టీటీఈలు వచ్చినా మత్తు పదార్థాల అమ్మకపుదారులు తమ వద్ద ఉన్న వస్తువులను సంచుల్లో దాచేస్తున్నారు. ఈ విషయం ఆర్పీఎఫ్ ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేసి, నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.

- మురారిలాల్ మీనా, గుంతకల్లు రైల్వే స్టేషన్ మేనేజర్

ఆదర్శం.. అంధుల కులాంతర వివాహం



జంటను ఆశీర్వదిస్తున్న మాజీ మేయర్ స్వరూప తదితరులు

అనంతపురం టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వారిద్దరూ దివ్యాంగులు.. సమాజమే బంధువులై కార్యనిర్వాహకులుగా మారగా వేదపండితుల మంత్రోచ్చారణలు వారి కులాంతరాలను సైతం దూరం చేసి ఇద్దరినీ ఏకం చేశాయి. నెల్లూరు జిల్లా కలవాయి మండలం ఉయ్యాలపల్లెకు చెందిన భాస్కర్, అనంతపురం జిల్లా కుందుర్పి మండలానికి చెందిన హనుమక్క ఇద్దరూ పుట్టుకతోనే అంధులు. వారి కులాలు వేరైనప్పటికీ ఇరు కుటుంబాల అంగీకారంతో సాయి ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని శివబాలయోగి ఆశ్రమంలో భాస్కర్, హనుమక్కలకు ఆదర్శ కులాంతర వివాహాన్ని తాడిపత్రి చింతల వెంకటరమణస్వామి దేవాలయ అర్చకుడు శ్రీనివాస దేశికన్, చిన్నజీయర్ స్వామి శిష్యుల సమక్షంలో హిందూ సంప్రదాయ పద్ధతిలో జరిపించారు. అనంతరం వారికి వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్‌ను అందజేశారు. ఈ వివాహానికి మాజీ మేయర్ మదమంచి స్వరూప హాజరై ఆశీర్వదించారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ నిర్వహించిన కార్యక్రమంలో టీసీ జయచంద్రరెడ్డి, సరస్వతమ్మ, సుబ్బరాయుడు, శోభారాణి, శివబాలయోగి ఆశ్రమ అధ్యక్షుడు జూటూరు అరవింద్, కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నిక

పీఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ



నూతనంగా ఎన్నికైన కమిటీ



జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ



ఉపాధ్యక్షురాలు క్రిష్ణజ్యోతి

అనంతపురం న్యూటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా అనంతపురం సబ్‌డివిజన్-1 డీఈఈ లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని పంచాయతీరాజ్ ఎస్ఈ సర్కిల్ కార్యాలయంలో శనివారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంగీతరావు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. గౌరవాధ్యక్షులుగా గుత్తి డీఈఈ డీఎల్ మురళీధర్, ఉపాధ్యక్షులుగా సబ్‌డివిజన్-2 డీఈఈ క్రిష్ణజ్యోతి, డీఈఈ నారాయణ స్వామి, జనరల్ సెక్రటరీగా ఏఈఈ గోపాల్‌నాయక్, ట్రెజరర్‌గా పీఐయూ ఏఈఈ, ధర్మవరం ఇన్‌చార్జ్ డీఈఈ పాండురంగారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఓబులేసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు సంగీతరావు ప్రమాణం చేయించారు. అనంతరం ఎన్నికైన సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు, ఈఈ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

అనంతపురం క్రైం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని బుడ్డప్ప నగర్‌కు చెందిన స్వర్ణలత(25) కుటుంబ కలహాలతో ఉరివేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు, చిలమత్తూరుకు చెందిన స్వర్ణలత అలియాస్ రేఖ, కల్లూరుకు చెందిన రవి ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఏడాదిన్నర వయసున్న పాప ఉంది. ఇటీవల దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో స్వర్ణలత ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి, ఆసుపత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందింది. ఆమె తండ్రి కర్రెన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం చోరీ

అనంతపురం మహల్దార్ వీధిలోని ఇస్మాయిల్ దుకాణంలో రూ.3.90 లక్షల విలువైన బంగారం ఆభరణాలు చోరీ అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మరో దుకాణం యజమానిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

దివ్యాంగ మహిళపై అత్యాచార యత్నం

కనగానపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఒంటరిగా పడుకున్న దివ్యాంగ మహిళపై ముత్తవకుంట్ల గ్రామానికి చెందిన ఓ వైసీపీ కార్యకర్త అత్యాచారానికి యత్నించాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన ప్రసాద్ శుక్రవారం అర్ధరాత్రి ఒంటరిగా పడుకున్న ఓ దివ్యాంగ మహిళ ఇంట్లోకి దూరి అత్యాచారానికి యత్నించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో అతను పారిపోయాడు. బాధితురాలు శనివారం కనగానపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

న్యూస్ బాక్స్

ఘనంగా జ్యోతి వేడుకలు


అలంకరణలో తిక్కయ్యస్వామి విగ్రహం

ధర్మవరం రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వసంతపురం గ్రామంలో వెలసిన తిక్కయ్య స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న జ్యోతి వేడుకలు శనివారం ముగిశాయి. ప్రతి ఏటా కార్తీకమాసంలో పౌర్ణమి తర్వాత రెండురోజుల పాటు జ్యోతి వేడుకలను నిర్వహిస్తామని గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆలయంలో స్వామి వారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అర్ధరాత్రి జ్యోతిని వెలిగించి ఆలయ ప్రదక్షిణ చేశారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి జ్యోతిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగానందరెడ్డి, ఆలయకమిటీ చైర్మన్ తరుణ్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ధ్వజ స్తంభ ప్రతిష్ఠ


ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు

గాండ్లపెంట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కదిరి- రాయచోటి ప్రధాన రహదారిలోని చిన్నమిట్ట వద్ద నూతనంగా నిర్మించిన అయ్యప్ప ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా మూడో రోజు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం ఆలయ అర్చకులు, వేదపండితులచే పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం చెక్క భజనతో పలు సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అయ్యప్పస్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

వాహనాల తనిఖీ

గాండ్లపెంట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఎస్ఐ క్రాంతి కుమార్ శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహన దారులకు పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ నియమాలు పాటించక పోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాల రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేనివారికి జరిమానా వేశారు. ఈ తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ గంగాధర, పోలీసులు శ్రీనివాసులు, నరసింహులు పాల్గొన్నారు.

ఆర్థిక సమస్యలతో నర్స్ ఆత్మహత్య

ధర్మవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడంతో మనస్థాపానికి గురైన ఓ నర్సు శనివారం పట్టణంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పట్టణంలోని సాయినగర్‌కు చెందిన యశోద(36) బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. ఆమెకు భర్త దూరంగా ఉంటున్నాడు. అయితే కుటుంబంలోని ఆర్థిక పరిస్థితులతో ఆమె తరచూ మనస్థాపానికి గురయ్యేది. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చుట్టుపక్కల వారు గమనించి ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

● ఒకరికి గాయాలు

బత్తలపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బైపాస్ రోడ్డులో శనివారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. బత్తలపల్లికి చెందిన గంగాధర్ తన పాడి ఆవుల కోసం గడ్డి మోపును ద్విచక్రవాహనంలో తీసుకొని ఇంటికి వెళ్తున్నాడు. కదిరి వైపు నుంచి వస్తున్న కారు ఆ ద్విచక్రవాహనాన్ని ఢీ కొంది ఈ ప్రమాదంలో గంగాధర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని స్థానిక ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేస్ నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఏబీ పల్లి తండా వద్ద మరో ఇద్దరికి...

ముదిగుబ్బ, నవంబరు, 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఏబీపల్లి తండా సమీపంలో శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఏబీపల్లి తండాకు చెందిన రమేష్ నాయక్, శంకర్ నాయక్ ద్విచక్ర వాహనాల్లో ఎదురెదురుగా ఢీకొన్నారు. తీవ్రగాయాల పాలైన ఇద్దరిని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

షార్టు సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం

బుక్కపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో శనివారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గ్రామానికి చెందిన రామాంజినేయులు బార్బర్ షాపు పూర్తిగా కాలిపోయింది. కులవృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న తరుణంలో షాపు పూర్తిగా దగ్ధమవడంతో జీవనం కోల్పోయానని బాధితుడు వాపోయాడు. తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

రజకులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

● రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేష్


కార్పొరేషన్ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న రజక సంఘం నాయకులు

కదిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రజకులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్‌సీ పరమేష్ కోరారు. స్థానిక ఎన్‌జీఓ హోంలో ఏపీ రజక సంఘం ఆధ్వర్యంలో శనివారం కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్‌సీ పరమేష్, ఏపీ రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివయ్యను ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ రజకులకు 200 యూనిట్లు ఉచితంగా కరెంట్ ఇస్తామన్న హామీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు తలుపుల గంగన్న, తలుపుల నారాయణ, నల్లబల్లి శంకర్, బూర్గు నాగరాజు, మీరాశి వేమనారాయణ, రామ్‌కుమార్, శివ శంకర్, హెచ్‌ఎం నాగరాజు, నూతనంగా ఎన్నికైన పట్టణ కమిటీ అధ్యక్షుడు పులగంపల్లి శివప్ప, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, ఉపాధ్యక్షులు గంగరాజు, భాను ప్రకాష్, సైదాపురం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో లేని విద్యుత్ సిబ్బంది

● సకాలంలో పరిష్కారం కాని సమస్యలు
● ఇబ్బందులు పడుతున్న ప్రజలు, రైతులు


పాత సినిమా టెంట్ వద్ద చింతమానులో వెళ్లిన విద్యుత్ తీగలు

నల్లమాడ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో రైతులు, సామాన్య వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఆ శాఖ సిబ్బంది, అధికారులు ఉన్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్లలో ఫ్యూజ్ పోతే కూడా వేసే నాథుడే లేడని వినియోగదారులు, రైతులు మండిపడుతున్నారు. మండలంలో పనిచేసే విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది అందరూ పట్టణాలలోనే నివాసాలు ఉంటూ చుట్టపుచూపుగా వచ్చిపోతున్నారని విమర్శలు ఉన్నాయి. వర్షాకాలంలో రాత్రి పూట ఫ్యూజు పోతే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. అలాంటి సమయంలో రాత్రంతా ఇళ్లల్లో కరెంట్ లేక దోమల బెడదతో పాటు ఉక్కపోత తప్పదని అంటున్నారు. ఇన్‌చార్జ్ అధికారులతో మరింత సమస్యగా మారింది. విద్యుత్‌శాఖలో ఏ చిన్న సమస్య వచ్చినా పట్టణాలలో ఉన్న అధికారులకు ఫోన్ చేసి చెప్పుకోవాల్సి ఉంటుంది. తమ దగ్గర ప్రైవేటు హెల్పర్‌గా పనిచేస్తున్న వారిని పురమాయిస్తుంటారు. వారికి ఖర్చులకు ఇవ్వాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. మండలంలో 14 పంచాయతీలు ఉన్నాయి, ఒక్కో పంచాయతీకి ఒకరు చొప్పున లైన్‌మ్యాన్లు (హెల్పర్) ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం ఆరుగురు మాత్రమే పనిచేస్తున్నారు. పోల్ టు పోల్ వర్కర్లు సైతం ఆరుగురే ఉన్నారు. లైన్‌మ్యాన్‌లు, పోల్ టు పోల్ వర్కర్లు కూడా స్థానికంగా ఉండకపోవడంతో సమస్యగా మారింది. ఓడీచెరువు ఏఈ నల్లమాడ మండలానికి ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్నారు. మండల వ్యాప్తంగా విద్యుత్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. చాలా గ్రామాల్లో విద్యుత్ తీగలు చేతికందే విధంగా వేలాడుతున్నాయి. కొన్ని చోట్ల విద్యుత్ వైర్లు చెట్ల మధ్యలో దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రంలో నిత్యం గంటల తరబడి విద్యుత్ సరఫరాలో అంతరాయ కలుగుతుండడంతో వివిధశాఖల కార్యాలయాల్లో ఇబ్బంది పడుతున్నారు. ఎర్రవంకపల్లిలో రామచంద్రారెడ్డికి అనే రైతుకు ఐదెకరాల మామిడితోట ఉంది. ఆ తోటలో 11కేవీ వైర్లు చేతికి అందే ఎత్తులో వేలాడుతున్నాయని ఆయన తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులకు గోడును విన్నవించుకున్నా ఫలితం లేదని ఆయన వాపోయారు. గాలి, వానకు రెండు వైర్లు జాయింట్ అయితే పెద్ద ప్రమాదమే జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. చౌటకుంటపల్లిలోని నాగభూషణరెడ్డి అనే రైతుకు చెందిన పొలంలో 11కేవీ లైన్ వైర్లు మామిడి చెట్ల మీదుగా పడి ఉన్నాయి. వైర్లు ఆరు అడుగుల ఎత్తులో ఉన్నాయని గతంలో ఏఈకి కూడా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.


ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కిందే ట్రాన్స్‌ఫార్మర్

ఏఈకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



నాకు మామిడితోట ఉంది. అందులో 11కేవీ విద్యుత్ లైన్లు ఆరు అడుగుల ఎత్తులోనే మామిడి చెట్లకు తలుగుతున్నాయి. గతంలో ఉన్న విద్యుత్ శాఖ ఏఈకి సమస్య గురించి ఫిర్యాదు చేశాను. అయినప్పటికీ విద్యుత్‌శాఖ అధికారులు ఎవరూ సమస్యను పరిష్కరించలేదు. కనీసం సమస్యను పరిశీలించిన పాపాన పోలేదు.

- నాగభూషణరెడ్డి, రైతు, చౌటకుంటపల్లి

స్థానికంగా ఉండాలని ఆదేశించాం

విద్యుత్‌శాఖలో పనిచేసే సిబ్బంది మండల కేంద్రంలోనే నివాసాలు ఉండాలని ఇప్పటికే ఆదేశించాం. ఈ మేరకు గత నెలలోనే సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ఎక్కడ పనిచేస్తారో అక్కడే నివాసాలు ఉండాలని, అలాంటప్పుడే రైతులకు అందుబాటులో ఉండగలరని సూచించాం. తద్వారా సులువుగా సమస్యలు పరిష్కరించేందుకు వీలవుతుందని చెప్పాం. మండల కేంద్రాల్లో నివాసం లేకపోతే శాఖాపరమైన చర్యలు చేపడతాం.

- శ్రీకృష్ణదేవ, డీఈ, విద్యుత్‌శాఖ

సమాజ చైతన్యానికి కృషి చేసిన కనకదాస

● మాజీ మంత్రి పల్లె ● ఘనంగా జయంతి వేడుకలు


బుక్కపట్నంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె

బుక్కపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమాజ చైతన్యానికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి భక్త కనకదాస అని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో శనివారం కనకదాస 538వ జయంతి వేడుకలను కురుబ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సామాజిక తత్వవేత్తగా, స్వరకర్తగా భక్త కనకదాస సమాజ చైతన్యానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆ మహనీయు డి సేవలను ప్రభుత్వం గుర్తించి ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జయంతి సందర్భంగా కనకదాస చిత్రపటాన్ని, గురవయ్యల విన్యాసాలతో గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులతో పాటు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

● ధర్మవరం /ముదిగుబ్బ/ బత్తలపల్లి: కనకదాస చూపిన మార్గంలో కలిసి కట్టుగా నడుద్దామని ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ పిలుపు నిచ్చారు. కనకదాస జయంతి సందర్భంగా పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం లో ఉన్న యశో దమ్మ, వకీలు పెదయ్య కురుబ కల్యాణ మండపం నుంచి బైకు ర్యాలీ నిర్వహించారు. కళాజ్యోతిలోఉన్న కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం లోనికోటలో నూత నంగా ఏర్పాటు చేసిన కనకదాస విగ్రహాన్ని ఆవిష్కరించారు. పెద్దఎ త్తున అన్నదానం చేపట్టారు. కురుబ కల్యాణ మండపం సెక్రటరీ బలరాం, నాయకులు మాలగుండ్ల రవీంద్ర, పూజారి నరసింహులు, గవ్వల నారాయణస్వామి కోటివెంకటేశ్, గవ్వలబాబు, గొట్లూరు శివయ్య, పోతుకుంట రమేశ్, అడ్రమహేశ్, గిరిక నాగేంద్ర, గిరక నారాయణస్వామి, మల్లన్న, కపాడం ఈశ్వ రయ్య, చికెన్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నా రు. అలాగే మది గుబ్బలోని బస్టాండ్ కూడ లిలో కురుబ సంఘం నాయకులు కనక దాస చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బత్తలపల్లిలోని నాలుగు రోడ్ల కూడలి, మండలంలోని అప్రా చెరువు గ్రా మంలో కనకదాస చిత్రపటానికి పూ లమాలలు వేసి నివాళులర్పించారు.


ధర్మవరంలో నివాళి అర్పిస్తున్న కురుబ సంఘం నాయకులు



రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన బాల బాలికల జట్లు

హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

కదిరి అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఆవరణంలో ఎంపికపోటీలు నిర్వహించి, హ్యాండ్‌బాల్ జిల్లా బాలురు, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ శనివారం తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 200మంది పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. బాలుర జూనియర్ జిల్లా జట్టులో జశ్వంత్‌నాయక్, సాయికుమార్, విశ్వనాథ్, కుమార్, నారాయణ, వేణు, తనయ్, సిద్ధార్థ, భరత్, హర్షా, యోగేంద్ర, పవన్‌కుమార్, వంశీ, నిఖిల్‌నాయక్, జ్యోషినాయక్, మహేంద్ర, గణేష్, లోహిత్ ఎంపికైన ట్లు తెలిపారు. అలాగే బాలికల జిల్లా జట్టుకు షమీరా, స్వప్న, ఆదర్శని, పవిత్ర, జ్యోయా, ఓంశ్రీ, పరహాన్, మోక్షిత, లిఖిత, ఉజ్వల, రీతూ, జ్ఞాపిక, హాసినీ, వనజ, వినీత, స్వాతిప్రియ, హర్షిత, పవిత్ర, హర్షిణి, వేదసన్ ఎంపికైనట్లు తెలిపారు. వీరు త్వరలో పల్నాడులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి మహేష్, పీఈటీలు దానమయ్య, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత

● గోదాములున్నా నిల్వ శూన్యం
● పక్క మండలాలకు వెళ్తున్న రైతులు


సాగులో ఉన్న మొక్కజొన్న పంట

తాడిమర్రి. నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అసలే అరకొరగా వస్తున్న నీరు... ఆ పై ఎరువుల కొరత... రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటలకు యూరియా వాడకం అధికంగా ఉంటుంది. నెలకు ఒకమారు చొప్పున తక్కువ మోతాదులో యూరియాను పంటలకు వేస్తుంటారు. కానీ మండల రైతులకు ప్రస్తుతం యూరియా అందుబాటులో లేదు. నెల రోజుల క్రితం యూరియా అందుబాటులో లేదంటూ రైతులు గగ్గోలు పెట్టడంతో.. జిల్లా వ్యాప్తంగా అధికారులు ఆయా గ్రామ సచివాలయాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో అందు బాటులో ఉంచారు. అలాగే డీఏపీ, 10-26-26 ఎరువులను కూడా సరఫరా చేశారు. ఆ నిల్వ కాస్తా అయిపోగానే మళ్లీ కొత్తగా తెప్పించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎరువులను నిల్వ చేసుకునేందుకు అవసరమయ్యే గోదాములు సిద్ధంగా ఉన్న వాటిని ఉపయోగించుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినవస్తు న్నాయి. మండల కేంద్రంలో వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఎరువులను నిల్వ చేసుకుని రైతులకు పంపిణి చేసేందుకు అవసరమయ్యే గోదాములను రూ.40లక్షల వ్యయంతో నిర్మించారు. కానీ ఇంతవరకు ఈ ఏడాది ఒక్క బస్తా ఎరువు కూడా వాటి ద్వారా పంపిణీచేయలేదు. అలాగే మండల వ్యాప్తంగా తొమ్మిది రైతు సేవా కేంద్రాలుండగా... ఒక పిన్నదరి రైతు సేవా కేంద్రంలో మాత్రమే అరకొరగా యూరియా అందుబాటులో ఉంది. మండల స్థాయి అధికారులు రైతులపై కాస్త శ్రద్ధ ఉంచి రైతు సేవా కేంద్రాల్లో యూరియాతో పాటు ఇతర ఎరువులను, పురుగుల మందులను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

యూరియా దొరకడం లేదు



నేను ఒకటిన్నర ఎకరంలో మొక్కజొన్న సాగుచేసి 15 రోజులైంది. ఇప్పుడు యూరియా వదిలితే పంట ఏపుగా పెరిగి మంచి దిగుబడి వస్తుంది. కానీ తాడిమర్రి మండలంలో యూరియా దొరకడంలేదు. అధికారులు దీనిపై స్పందించాలి.

- అంకె గోపి, రైతు, తాడిమర్రి

పక్క మండలానికి వెళ్తున్నాం



నేను మూడు ఎకరాలలో వరిపంట సాగుచేశా. ఇప్పుడు యూరియా వేయాలి. అయితే ఎక్కడా యూరియా దొరకడంలేదు. నార్పలకు వెళ్లి తెచ్చుకోవాలని అంటున్నారు. తాడి మర్రిలో ఎందుకు యూరియా నిల్వఉంచలేదో తెలియడంలేదు. నార్పల నుంచి తెచ్చుకోవాలంటే ఖర్చు అధికమవుతుంది.

- కిష్టప్ప, రైతు, తాడిమర్రి

నారసింహుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు


స్వామివారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

కదిరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీలక్ష్మీ నరసింహస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. కార్తీక మాసంతో పాటు శనివారం కావడంతో జిల్లా నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో విద్యార్థులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. శుక్రవారం రాత్రి నుంచి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అలాగే భక్తులు ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగించారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు ఆలయ అధికారులు అన్నదానం నిర్వహించారు.

దేశభక్తిని రగిలించిన వందేమాతరం


ర్యాలీగా వెళ్తున్న డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు

అమడగూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర భావన, దేశభక్తి జ్వాలను రగిలించిన గీతం వందేమాతరం అని కిసాన్ మోర్చా ఆర్గానిక్ సెల్ రాష్ట్ర కార్యదర్శి శరత్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా స్థానిక ఓబులేశ్వర డిఫెన్స్ అకాడమి ఆధ్వర్యంలో శనివారం మండలకేంద్రంలో 5కే రన్ నిర్వహించారు. శరత్ కుమార్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. మండల సరిహద్దు నుంచి ఇద్దేవాండ్లపల్లి మీదుగా తుమ్మలకొండ వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అకాడమి విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిఫెన్స్ అకాడమీ చైర్మన్ ఓబులేశు, లాయర్ ప్రభాకర్‌రెడ్డి, హరీష్‌కుమార్, భార్గవ్, మదన్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శి లేక ఇబ్బందులు


ఖాళీగా ఉన్న కార్యదర్శి కుర్చీ

తనకల్లు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కోటపల్లి గ్రామ సచివాలయానికి కార్యదర్శి లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న కార్యదర్శి బదిలీపై వెళ్లారు. తరువాత ఇన్‌చార్జీల పాలనలో సాగుతోంది. ప్రస్తుతం పనిఒత్తిడి కారణంగా ఇన్‌చార్జీలు సకాలంలో హాజరుకావడంలేదన్న విమర్శలు ఉన్నాయి. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' సచివాలయాన్ని సందర్శించగా.. ఇక్కడ కేవలం డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు మాత్రమే హాజరయ్యారు. అగ్రికల్చర్ అసిస్టెంట్, మహిళ పోలీస్ సెలవులో ఉన్నారు. వీఆర్‌ఓ ఉన్నారో లేదోకూడా తెలియడంలేదని గ్రామస్థులు ఆరోపించారు. ఏఎన్‌ఎం సచివాలయ పరిధిలోని మరాల పల్లిలో 104 కార్యక్రమానికి హాజరయ్యారు. పనిచేస్తున్న సిబ్బందిలో ఇద్దరు మాత్రమే సచివాలయంలో ఉండడంతో సచివాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సచివాలయంలో సిబ్బంది సకాలంలో విధులుకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'అందరు కలిసిమెలసి ఉండాలి'


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

ధర్మవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జూనియర్, సీనియర్ అన్న తేడాలేకుండా అందరు కలసిమెలసి ఉండాలని వివేకానంద డిగ్రీ కళాశాల చైర్మన్ గండికోట చిన్నపరెడ్డి విద్యార్థులకు సూచించారు. స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో శనివారం సీనియర్ విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల చైర్మన్ గండికోట చిన్నపరెడ్డి మాట్లాడారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రమశిక్షణ అలవరచుకోవాలన్నారు. అదేవిధంగా అన్ని రంగాల్లో రాణించినప్పుడే పోటీ ప్రపంచంలో జయిస్తామన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ బాలం లక్ష్మీనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ కరణం హర్షవర్ధన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కందిపై తుఫాన్‌ల ప్రభావం

● రాలిపోతున్న పూత ● పచ్చపురుగు దాడి


కంది పూత రాలిపోయిన దృశ్యం

ధర్మవరం రూరల్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా ఖరీఫ్‌లో సాగుచేసిన కంది పంటకు తెగుళ్లు సోకాయి. మండలవ్యాప్తంగా సుమారు ఏడు వేల హెక్టార్లకు పైగా కంది సాగుచేసినట్లు వ్యవసాయాధికారులు తెలుపుతున్నారు. అయితే ఇటీవల తుఫాన్ల ప్రభావంతో కంది పూత, పిందెపై ప్రభావం చూపుతోంది. పూత రాలిపోవడం, పిందెలను పచ్చపురుగు ఆశించడంతో పంటంతా దెబ్బతింటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులు ఎరువుల దుకాణాల వద్దకు పరుగులు తీస్తున్నారు. రూ. వేలకు వేలు వెచ్చించి మందులు కొనుగోలు చేసి పిచికారి చేస్తున్నారు. ఈ ఏడాది తుఫాన్లు, వర్షాల ప్రభావం పంటపై చూపిందని, వీటికి తోడు పురుగు ఆశించడంతో పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందనే ఆందోళన కలుగుతోందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి పంటను రక్షించేందుకు సలహాలు, సూచనలతో పాటు ఏయే మందులు పిచికారిచేయాలో తెలియజేయాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

వనం వదిలి జనంలోకి..!

యథేచ్ఛగా వచ్చేస్తున్న వన్యప్రాణులు
రోడ్డు ప్రమాదాల్లో తరచూ మృతి
పట్టించుకోని అటవీశాఖ అధికారులు



పంట పొలాల్లో జింకలు

చిలమత్తూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులు వనం వదిలి జనంలోకి వచ్చేస్తున్నాయి. జనాలంటే భయం వీడి ధైర్యంగా పల్లెల్లోకి అడుగులేస్తున్నాయి. ఒకప్పుడు నెమళ్లు, జింకలు, కొండచిలువలు, చిరుత, ఏనుగు, సింహం వంటి వాటిని చూడాలంటే పెద్ద పెద్ద సర్కస్‌లలోనే లేక జంతు ప్రదర్శనశాలకో వెళ్లాల్సి వచ్చేది. ఇక హైనా, గుంట నక్కలు, నక్కలు, ఎలుగుబంటి, అడవి పందులు, తోడేళ్లు వంటివి అడవుల్లోనే కనిపించేవి. అయితే ఇప్పుడు కాలం మారింది. ఈ వన్య ప్రాణులు అన్నీ జనం మధ్యలోకి వచ్చేస్తున్నాయి. ఏ మాత్రం భయం లేకుండా జనంతో కలిసి పోతున్నాయి. అడవిలో ప్రశాంతంగా జీవించాల్సిన వన్య ప్రాణులు ఇలా జనవాస ప్రాంతాల్లోకి క్యూ కడుతుండటంపై ప్రజల్లో ఆందోళన మొదలైంది. ఒక పక్క జనంలోకి వస్తున్న జంతువులు, పక్షులతో పంటల నష్టం జరుగుతుండగా, మరో పక్క వన్యమృగాలతో ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని బయటికి వెళుతున్నారు. ఇలా వన్యప్రాణులు వాటి స్థావరాలను వదిలి జనవాసాల్లోకి రావడంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భయం వీడి జీవాలతో కలిసి

ఒకప్పుడు వన్యప్రాణులు ఆరుబయల్లోకి వచ్చేందుకు భయపడేవి. దాంతో రాత్రి సమయాల్లో మాత్రమే అడవి నుంచి చుట్టుపక్కల ప్రాంతాల్లో సంచరిస్తూ ఆహార సేకరణ చేసేవి. అయితే ఇప్పుడు అలా కాదు. యథేచ్ఛగా రైతులు పోషించుకుంటున్న గొర్రెలు, మేకలు, పాడి ఆవులతో కలిసి మేత మేస్తున్నాయి. జీవాల వెంట మనుషులు ఉన్నా ఏ మాత్రం జంకుకుండా జీవాలతో కలిసి చీకటి పడే వరకు మేత మేస్తున్నాయి.

వేటగాళ్ల తాకిడితోనే...

చిలమత్తూరు మండలంలో సుమారు 5 వేల ఎకరాలపైనే ఎర్రకొండ అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఈ అడవిలో జింకలు, నెమళ్లు, అడవి పందులు, కుందేళ్లు ఎక్కువగా ఉంటున్నాయి. అయితే వీటి కోసం కర్ణాటక ప్రాంతానికి చెందిన వేటగాళ్లు ఈ అటవీ ప్రాంతంలోకి వేటకు వస్తున్నట్లు సమాచారం. దీంతో వారి తాకిడి తట్టుకోలేక ఈ అడవిలో ఉన్న వన్య ప్రాణులు ఒక్కొక్కటిగా వనం వీడి జనంలోకి వచ్చేస్తున్నాయని అంటున్నారు

వన్యప్రాణులకు ప్రమాదాల ముప్పు

ఎర్రకొండ అటవీ ప్రాంతానికి ఆనుకొని పలు క్వారీలు ఏర్పాటుకావడం వన్యప్రాణులకు శాపంగా మారిందనే చెప్పాలి. క్వారీల నుంచి వచ్చే పెద్ద పెద్ద శబ్ధాలకు వన్యప్రాణులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని జనవాసంలోకి వచ్చేస్తున్నాయి. వీరాపురం, యగ్నిశెట్టిపల్లి, దేమకేతేపల్లి ప్రాంతాల్లో క్వారీల సంఖ్య పెరగడంతో ఆ ప్రాంతాన్ని వదిలి పంట పొలాల్లోకి వచ్చేస్తున్నాయి. ఈ సందర్భంలో అవి ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నాయి. ప్రధానంగా లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో ఎక్కువగా జాతీయ రహదారిపై జింకలు పలు సందర్భాల్లో ప్రాణాలు కోల్పోతున్నాయి, రోడ్డు దాటుతుండగా వాహనాలు ఢీకొట్టి మృతి చెందుతున్నాయి. ఇటీవల చిలమత్తూరులో ఆరు నెలల నెమలి ద్విచక్రవాహనం ఢీకొనడంతో మృతి చెందింది. 44వ జాతీయ రహదారిలో అప్పన్నపల్లి క్రాస్ వద్ద, కోడూరు గోరంట్ల రోడ్డులో ముద్దపల్లి వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాయి. ఇలా అవి జనంలోకి వచ్చిన సమయంలో ఎటువెళ్లాలో తెలియక ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నాయి.

అటవీ ప్రాంతాల్లో కనపడని వసతులు

చిలమత్తూరు మండలంలో ఉన్న 5 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని అటవీ భూమిగా ప్రభుత్వం రిజర్వు చేసింది. దీంతో ఈ ప్రాంతంలో వన్య ప్రాణులు తలదాచుకుంటున్నాయి. అయితే ఈ ప్రాణులు అటవీ ప్రాంతంలోనే సురక్షితంగా జీవించడం కోసం అటవీశాఖ తగిన ఏర్పాట్లు చేయడంతో విఫలమైందనే చెప్పాలి. ప్రధానంగా వాటికి తాగునీరు. వేటగాళ్ల నుంచి రక్షణ, చెట్లు సంరక్షణ, పేలుడు శబ్దాలు లేకుండా చూడటం వంటి చర్యలు తీసుకోవాలి. అయితే ఆ దిశగా ఎలాంటి చర్యలు కనపడలేదనే చెప్పాలి. ఉన్న చెట్లు ఒక పక్క నరికేస్తున్నా, మరో పక్క అటవీ ప్రాంతానికి ఆనుకొని క్వారీల్లో బండరాళ్లను పెద్ద పెద్ద శబ్ధాలతో పగులుకొడుతున్నా, వేటగాళ్ల యథేచ్ఛగా వేటను కొనసాగిస్తున్నా అధికారుల నుంచి స్పందన ఏమాత్రం లేదని అంటున్నారు. దీంతోనే వన్యప్రాణులు ప్రాణ భయంతో జనవాసాల్లోకి పరుగులు తీస్తున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇలా అడవిని వదిలి జనంలోకి వస్తున్న వన్యప్రాణులకు రక్షణ కల్పించడంలో అటవీశాఖ అధికారులు తీవ్రంగా విఫలమవుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. వాటిని యధావిధంగా అడవిలో జీవించాలంటే వాటికి అవసరమైన వసతులు ఏర్పాటుచేయాల్సిన బాధ్యత అటవీశాఖ అధికారులపై ఎంతైనా ఉంది.

తాగునీరు, ఆహారం ఉన్నచోటుకి వెళుతుంటాయి

వన్యప్రాణులు ఆహారం, తాగునీరు ఉన్నచోటుకి వెళుతుంటాయి. అడవిలో అవి దొరక్కపోతే పొలాల్లోకి వస్తుంటాయి. జింకల సమూహం ఎక్కువగా ఉంటుంది. వీటి వల్ల అక్కడక్కడ పంటలకు నష్టం చేకూరుతుంటుంది. పంట నష్టం జరిగితే ప్రభుత్వం పరిహారం అందిస్తుంది. చెట్లు నరకడం వలన కూడా అటవీ ప్రాంతాన్ని వదిలి వెళుతుంటాయి. రోడ్డు ప్రమాదాల్లో వన్యప్రాణులు మృతి చెందకుండా చర్యలు తీసుకుంటున్నాం. అటవీ ప్రాంతంలో ఉన్న రోడ్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. వేటగాళ్ల తాకిడి ఎక్కడా లేదు. ఎవరైనా వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు ఉంటాయి.

\- కుళ్లాయప్ప, అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్, హిందూపురం

ఘనంగా కనకదాస జయంతి



హిందూపురంలో కనకదాస విగ్రహం వద్ద టీడీపీ నాయకులు

హిందూపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కురుబల ఆరాధ్యదైవం కనకదాస జయంతిని హిందూపురంలో ఘనంగా జరుపుకున్నారు. శనివారం ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న కనకదాస విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి, పట్టణాధ్యక్షులు వెంకటేశ్, ఎమ్మెల్యే పీఏ బాలాజీ, నాయకులు చంద్రమోహన్, మంగేష్, రఘు, నాగేంద్ర, వెంకటస్వామి, డైమండ్ బాబా, వెంకటలక్ష్మీ, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



గుడిబండలో కలశాలతో మహిళలు

● గుడిబండ: మండలంలోని పిఎస్‌పాళ్యం గ్రామంలో శనివారం కనకదాస జయంతిని ఘనంగా నిర్వహించారు. మహిళలు హారతులు మోశారు.



పావగడలో జయంతిని నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

● పావగడ: పట్టణంలో కనకదాస జయంతిని ఘనంగా అధికారులు, వివిధ పార్టీ నాయకులు జరుపుకున్నారు. కనకదాసు గొప్ప సంఘ సంస్కర్త అని వారు కొనియాడారు.



కనకదాస విగ్రహం వద్ద బహుజన చైతన్యవేదిక సభ్యులు

● పెనుకొండ: బహుజన చైతన్యవేదిక ఆధ్వర్యంలో కనకదాస జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది శివ రామక్రిష్ణ, సభ్యులు వెంకటేష్, బాబుప్రసాద్, రవికుమార్, రామాంజినేయులు, ఆంధ్రూస్, లక్ష్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.



● గోరంట్ల పట్టణంలోని హిందూపురం రహదారిలో గ్యాస్ కార్యాలయం వద్దగల కనకదాస విగ్రహం వద్ద జయంతి వేడుకల్లో పాల్గొన్న కురుబ సంఘం నాయకులు

కోన మల్లేశ్వరస్వామి ఆలయంలో పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రొద్దం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆర్. మరువపల్లిలోని కోన మల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాస పూజలు శనివారం జరిగాయి. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వినియోగం జరిగింది.

సచివాలయానికి తాళంపై అధికారుల ఆరా

ఉద్యోగులు సంజాయిషీ ఇవ్వాలంటూ ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రొద్దం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆర్. లోచర్ల గ్రామ సచివాలయంలో మధ్యాహ్నానికే తాళం వేసి ఉద్యోగులు వెళ్లిపోవడంపై జిల్లా అధికారులు ఎంపీడీఓ రాంకుమార్‌తో ఆరాతీశారు. శనివారం ఆంధ్రజ్యోతిలో మధ్యాహ్నాంకే సచివాలయానికి తాళం కథనం ప్రచురింతమైంది. దీంతో ఉన్నతాధికారులు ఈ విషయంపై ఎంపీడీఓతో ఆరాతీసి ఉద్యోగులతో సంజాయిషీ తీసుకోవాలని ఆదేశించారు.

వెండి హారం అందజేత



వెండిహారాన్ని ఇస్తున్న జడ్పీటీసీ ఉమేష్

అగళి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హెచ్‌డిహళ్లి గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి జడ్పీటీసీ ఉమేష్ కుటుంబసభ్యులు వెండి హారాన్ని ఇచ్చారు. కార్తీక మాసం శనివారం నాడు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ కమిటీ వారికి వెండి హారాన్ని అందజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ నరసింహప్ప తదితరులు ఉన్నారు.

మట్టి నమూనా పరీక్షలు ఏవీ..?

అనంతపురం, పెనుకొండ వెళ్లాల్సిందే..!
రైతులకు తప్పని ఇబ్బందులు



మడకశిర మార్కెట్ యార్డులో ఉన్న అగ్రిటెస్టింగ్ ల్యాబ్

మడకశిర రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటుచేసిన అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లో మట్టి నమూనా పరీక్షలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రైతులు పెనుకొండ, అనంతపురం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు అంటున్నారు. స్థానిక ల్యాబ్‌లో మట్టి నమూనా పరీక్షలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వైసీపీ ప్రభుత్వం 2021లో స్థానిక మార్కెట్ యార్డులో రూ.62.30 లక్షలతో ఈ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో ఒక వ్యవసాయశాఖ అధికారి, ఇద్దరూ ఏఈఓలు విధులు నిర్వహిస్తున్నారు. ఈ ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, మట్టి నమూనా పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులకు సంబంధించిన నమూనాలకు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 1800 వరకు పరీక్షలు నిర్వహించారు. మట్టి నమునా పరీక్షలు మాత్రం ఇక్కడ నిర్వహించడం లేదు. దీంతో ఈ ప్రాంత రైతులు మట్టి నమూనా పరీక్షలు చేయించుకునేందుకు పెనుకొండ, అనంతపురం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని స్థానికంగా ఉన్న అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లోనే సాయిల్ పరీక్షలు చేయాలని రైతులు కోరుతున్నారు.



స్థానికంగా పరీక్షలు చేయాలి

శాస్త్రవేత్తలు పంటలు సాగుచేసే ముందు మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అందుకు అనుగుణంగా రైతులు మట్టినమూనా పరీక్షలు చేయించుకుంటున్నారు. అయితే స్థానికంగా అగ్రిటెస్టింగ్ ల్యాబ్ ఉన్నా అది ఇందుకు ఉపయోగపడడంలేదు. అధికారులు చర్యలు తీసుకుని మట్టి పరీక్షలు స్థానకంగానే నిర్వహించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

\- వేమారెడ్డి, రైతు, పపాసానిపల్లి

జిల్లాకు ఒక్కటే ల్యాబ్

మట్టి నమునా పరీక్షల ల్యాబ్ జిల్లాకి ఒక్కటి మాత్రమే ఉంది. శ్రీ సత్యసాయిజిల్లాకు సంబంధించి పెనుకొండలో ఉంది. రైతులు పొలాల్లో సేకరించిన మట్టి నమునాలను సంబంధిత రైతు సేవాకేంద్రాల్లో ఇస్తే వారు వాటిని పెనుకొండలో ల్యాబ్‌కు పంపుతారు. పరీక్షలు అనంతరం వివరాలను సంబంధిత రైతులకు తెలియజేస్తున్నారు.

\- కృష్ణమీనన్, ఇన్‌చార్జ్ ఏడీఏ, మడకశిర

విశ్రాంత ఉపాధ్యాయుడిపై
దొంగల దాడి

రూ.25 లక్షల బంగారం, రూ.15 లక్షల నగదు చోరీ



శంకరప్పను తుమకూరు ఆసుపత్రికి తరలిస్తున్న బంధువులు

పావగడ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్‌కాలనీలో నివసిస్తున్న యోగా గురువు, విశ్రాంత ఉపాధ్యాయుడు అంతరగంగ శంకరప్పపై దొంగలు దాడిచేసి గాయపరిచారు. ఇంటిలో ఉన్న రూ.25లక్షల విలువచేసే బంగారు, రూ. 15 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. తన కుమారుడి పెళ్లికోసం బంగారు, నగదును ఆయన సమకూర్చి ఇంటిలో ఉంచారు. అయితే రాత్రి దొంగలు ఇంటిలోకి చొరబడి రాడ్‌తో అతడి తలపై కొట్టి బంగారు, నగదును ఎత్తుకెళ్లారు. అపస్మారక స్థితిలో ఉన్న భర్తను చూసి భార్య గట్టిగా అరవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడి పరిస్థితి విషమించడంతో తుమకూరు ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. కాగా పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మూడు నెలల వ్యవధిలో 40 దొంగతనాలు జరిగినా ఒక్క కేసును కూడా పోలీసులు చేధించలేదని, ఇది వారి నిర్లక్ష్యానికి అద్దంపడుతుందని అంగన్‌వాడీ టీచర్ సుశీలమ్మ ఆగ్రహం వ్యకం చేశారు.

మంత్రిని కలిసిన ఏఎస్పీ



మంత్రికి మొక్కను అందజేస్తున్న ఏఎస్పీ

పెనుకొండ టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మంత్రి సవితను జిల్లా అడిషినల్ ఎస్పీ గీత సురాన మహవీర్ కలిశారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

ప్రైవేటీకరణను మానుకోవాలి
వైసీపీ నాయకులు

అమరాపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయవద్దని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కోటి సంతకాల కార్యక్రమాన్ని నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప చేపట్టారు. ఈ సందర్భంగా ఈరలకప్ప మాట్లాడుతూ వైసీపీ హయాంలో 17మెడికల్ కళాశాలలను ఆ మోదించారని, వాటిలో ఏడు పూర్తయ్యాయన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చి వాటిని ప్రైవేటీకరణ చేయడం సబబు కాదని, ఇందుకు నిరసనగా కోటి సంతకాల కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, గుండుమల తిప్పేస్వామి

గుడిబండ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఆ పార్టీని వీడి టీడీపీలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గొల్లపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు చిత్తనగిరియప్ప, రంగస్వామి, మురళిధర్, చిత్రలింగప్ప, చిత్తయ్య, తదితరులను ఎమ్మెల్యే టీడీపీ కండువావేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సింగిల్‌విండో అధ్యక్షుడు మద్దన కుంటప్ప జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు మంజునాథ్ తదితరులు ఉన్నారు.

నిధులు ఇవ్వండి

స్వచ్ఛభారత్ కార్పొరేషన్ చైర్మన్‌ను కోరిన ఎమ్మెల్యే



వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే, యాదవ సంఘం నాయకులు

మడకశిరటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న 122 గొల్లహట్టిలలో ప్రత్యేకంగా కమ్యూనిటీ భవనాలు, స్నానపుగదులు, బాత్‌రూంల ఏర్పాటుకు నిధులు కేటాయించాలని స్వచ్ఛభారత్ కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్‌కు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, యాదవ సంఘం నాయకులు శనివారం వినతి పత్రాన్ని అందించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పట్టాభిరామ్‌కు సమస్యను వివరించి అనంతరం వినతిపత్రాన్ని అందించారు. 15 రోజుల్లో నిధులను మంజూరు చేయించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొంటామని పట్టాభిరామ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ శ్రీనివాసమూర్తి, గుండుమల చంద్రప్ప, రొళ్ల మండల కన్వీనర్ ఈరన్న, మాజీ జడ్పీటీసీ సభ్యులు సన్నతిమ్మప్ప, మద్దనకుంటప్ప తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

రొద్దం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనంతపురంలో జిల్లాస్థాయి ఒకేషనల్, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సు పోటీల్లో రొద్దం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రొద్దం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అగ్రికల్చర్‌లో జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచిన రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. పదోతరగతికి చెందిన అశ్విని, అనుష్క, ఆదర్శ్ జయకుమార్, షోయబ్, అజయ్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. హెచ్ఎం లక్ష్మీనారాయణ వీరిని అభినందించారు.

బూదిలి ఉన్నత పాఠశాల విద్యార్థులు



మెమెంటో, సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

గోరంట్ల, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలి ఉన్నతపాఠశాలకు చెందిన బాలికలు బ్యాంకింగ్ లావాదేవీలపై ఉత్తమ ప్రదర్శన ద్వారా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్ఎం ప్రకాష్‌రెడ్డి, ఉపాధ్యాయులు క్రిష్ణ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బూదిలి ఉన్నత పాఠశాల విద్యార్థులు విద్య, బిందు, ధన్వంతరి, నవ్యశ్రీ బ్యాంకింగ్ లావాదేవీలపై వివిధరకాల అంశాలపై నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.